# పాడవే కోయిలా!

**-యం. ఆర్. అరుణకుమారి**

"నీ సమస్యను పరిష్కరించే శక్తి ఒక్క మీ నానమ్మకే ఉంది" ఉష చెప్పిందంతా విని, చాలాసేపు ఆలోచించాక చెప్పింది నీలిమ.

"హు! కొండను తవ్వి ఎలుకను పట్టినట్లుంది నీ సలహా!" నిరసనగా చూసింది ఉష. "నానమ్మ చాదస్తం గురించి తెలీనట్లు మాట్లాడుతావే? పెళ్ళి గురించి పట్టుబడుతున్నది నానమ్మే కదా!"

నీలిమ నవ్వింది మృదువుగా. "అవును కదా! పోగొట్టుకొన్న చోటే వెతుక్కోవాలి. సమస్య పుట్టినచోటే పరిష్కారాన్నీ పొందాలి."

"అంటే?" సాలోచనగా చూసింది ఉష.

"అవును ఉషా! నాన్నమ్మ పాతకాలం మనిషే కానీ... బూజుపట్టిన పురాతన భావాలు ఆమెకు లేవు. ఉంటే నువ్వసలు డిగ్రీ చదువు దాకా వచ్చేదానివే కాదు కదా! టెంత్ అవగానే పెళ్ళి చేసెయ్యాలని నిర్ణయించినా... చదువుకోవాలని నువ్వు పట్టుబట్టి మీ నాన్నమ్మ దగ్గర ఏడిస్తే... ఆవిడే కదా నిన్ను చదివిస్తున్నది!"

"నిజమే! కానీ ఈ విషయంలో మాత్రం ఆవిడ నాకు బద్ధ శత్రువై పోయిందే!" దిగులుగా చూసింది ఉష.

"ఈ విషయంలో ఆవిడే కాదు ఎవరైనా అలాగే ఆలోచిస్తారు. అల్లరి కాకూడదని అలాంటి... కాదు ఆ నిర్ణయమే తీసుకుంటారు. ఐనా నువ్వో విషయం మర్చిపోతున్నావు. శత్రువుతోనే కదా శాంతి చర్చలు జరపాల్సింది" అంటున్న నీలిమ వేపు ఒకింత విస్మయంగా చూస్తూ ఆలోచనలో పడిపోయింది ఉష.

❖❖❖

"అయ్యో! పెళ్ళికి పట్టుమని పది రోజులన్నా లేదు. ఇలా జరిగిందేమిటి? మీ అమ్మొక ముద్దు రాచిప్ప. పనులు చేయటం రాదు. చేయించుకోవటమూ తెలీదు. నా ఖర్మ కాకపోతే ఇప్పుడే నేనిలా మంచాన పడాలా?" విపరీతంగా బాధపడిపోతోంది నాన్నమ్మ. "ఇవాళసలు ఉగాది. తెలుగు సంవత్సరాది పండుగ. ఉగాదికి లేంది జగాదికి లేదని సామెత. పండగపూట తలస్నానం చేసి దేవుని పూజ చేసుకొనే భాగ్యం లేకపాయె కదా!"

"సర్లే నానమ్మా! నువ్వేం కావాలని పడ్డావా? బాత్రూంలో కాలుజారింది. చిన్న ఫ్రాక్చరేనన్నారు కదా డాక్టరు. నయమైపోతుందిలే. వచ్చే ఉగాదిని గ్రాండ్‌గా చేసుకుందాం లే!" ఓదార్పుగా చెప్పింది ఉష.

"నేనేమన్నా వయసులో ఉన్నానా? ఉడుకు రక్తమా? తొందరగా నయమైపోవడానికి? చేవ చచ్చిన ఎముక పుటుక్కున విరగనైతే విరిగింది గానీ అతుక్కోను ఎన్నాళ్ళు పడ్తుందో ఏమో! డెబ్బయి ఏండ్లకు... ఇలా... మంచాన పడ్తానని కల్లో కూడా అనుకోలేదే!" కళ్ళ నీళ్ళ పర్యంతమైన నాన్నమ్మ వేపు జాలిగా చూసింది ఉష.

నిజమే. నాన్నమ్మ మంచి ఆరోగ్యవంతురాలు. ఆమె తలనొప్పి, జ్వరం అని ఎప్పుడూ పడకెయ్యలేదు. చిన్న చిన్న అనారోగ్యాన్ని పట్టించుకోదు కూడా. తన పనులే కాదు, ఈ వయసులో కూడా వంట పనంతా ఆమెదే! శుచిగా, రుచిగా వంట చెయ్యటం ఆమె ప్రత్యేకత. ఎప్పుడన్నా నాన్నమ్మ అత్తయ్య వాళ్ళింటికో, పెళ్ళికో... ఊరెళ్ళితే... అమ్మ చేసే వంట నచ్చక ఇంటిల్లిపాదీ ఆమె రాకకోసం ఎదురు చూస్తుంటారు. అసలావె ఊరెళ్ళేటప్పుడే తొందరగా వచ్చెయ్యమని తనే అల్టిమేటం యిస్తూంటుంది అందరి తరఫునా! అవును మరి నాన్నమ్మంటే ఇంట్లో అందరికీ భయమే నాన్నతో సహా! తనకే ఆమె దగ్గర చనువు. గారాబం కూడా! అందర్తో గంభీరంగా ఉండే నాన్నమ్మ తనతో సరదాగా మాట్లాడుతుంది.

"ముసల్దాన్నయిపోయా! ఇంకా నా ఊపిరి తీస్తారేం? మీ అమ్మ వండేది చేదా? నేనసలు నెల రోజులు రాను పో! ఐనా నా వంట కోసమేగా! నా కోసం కాదుగా!" నాన్నమ్మ చిన్నపిల్లలా అలిగితే తాను నాన్నమ్మ వీపు కరుచుకొని మెడ చుట్టూ చేతులేసి ఊగుతూ ముదిగారాలు పోయేది.

"అది కాదు ముసలమ్మా! నువ్వు లేకపోతే నాకేం తోచదు మరి!"

"ఆఁ! ముసలమ్మా! ఔను నేను ముసలమ్మనే. మరి ముసలమ్మతో నీకేంటే పడుచుదానా?" ముసిముసి నవ్వులు దాచుకొంటూ ఉక్రోషం చూపేది.

"నువ్వే కదా మరి నా బెస్ట్ ఫ్రెండ్‌వి. నీకు తెలీదు నాన్నమ్మా! ఓల్డ్ ఈజ్ గోల్డ్." నాన్నమ్మ బుగ్గను ముద్దాడుతూ చెప్పేది తను.

"మీ అత్తయ్య పరమ గయ్యాళి. ఊరుకోదే! పోట్లాడుతుంది."

"దేనికి నాన్నమ్మా?" తను ఆశ్చర్యంగా చూస్తే నవ్వేసేది గలగలా.

"నా ఒంటి మీది బంగారమంతా నీకిచ్చేస్తే!"

"ఓ! నాన్నమ్మా! నాకు నువ్వే కావాలి. నీ నగలు కాదు."

తన తల ఆప్యాయంగా నిమురుతూ చెప్పేది నాన్నమ్మ. "నాకు తెలుసు తల్లీ నీకు నేనంటే ఎంత ప్రేమో! అత్తయ్యకు ఎంతపెట్టినా ఆశే! పోనీ! ఆడబిడ్డ బాధపడ్తే ఇంటికి మంచిది కాదు. కొంచెం బంగారమిచ్చేద్దాం. మిగతాదంతా నీకే. సరేనా?"

"మరి నాకేమివ్వరా?" అమ్మ గొణిగేది. "రేపు మీరు మంచాన పడ్తే సేవలు చెయ్యాల్సింది నేనేగా?"

"ఏంటే అంటున్నావ్? బంగారం కోసం నేను మంచాన పడాలని కోరుకుంటున్నావా ఏంటీ?" నాన్నమ్మ గయ్‌మంది. "శ్రీరాముని దయతో నేను పడ్తే ఒకేసారి పాడె మంచం మీదే తప్ప పడను. ఒకవేళ అట్లాంటి పరిస్థితే వస్తే నా ఉష నన్నొదలదులే!" తన మీద నాన్నమ్మ పెట్టుకొన్న నమ్మకాన్ని తను వమ్ము చేయదు. లేచి తిరిగే దాకా నాన్నమ్మకు అన్ని సేవలూ తనే చేస్తుంది. ఐనా నాన్నమ్మ తను పుట్టినప్పట్నుంచీ తనకు ఎన్ని సేవలు చేయలేదు? తనిప్పుడెంత చేసినా తక్కువే!

"పెళ్ళి కూతురివి. నిన్ను కష్టపెడ్తున్నాను. కూచోపెట్టి చేయాల్సింది పోయి." నాన్నమ్మ ఆవేదనగా అంటుంటే ఎక్కళ్ళేని చిరాగ్గా అన్పించినా... వెదకబోయిన తీగ కాలికి తగిలినట్లు... ఎలా ఆ విషయం మాట్లాడాలా అని మథనపడ్తున్న ఉషకు అదే అదనుగా అన్పించింది.

"పెళ్ళి! పెళ్ళి!! పెళ్ళి!!! పెళ్ళి తప్ప జీవితానికి పరమార్థమే లేదా?" అణచిపెట్టుకున్న అసహనం, ఆవేశం, ఆగ్రహంతో గట్టిగా ప్రశ్నించింది ఉష. క్షణం తెల్లపోయినా అంతలోనే దిగులుగా చెప్పింది నాన్నమ్మ. "ఆడపిల్లల జీవితాలు పెళ్ళి, సంసారం, పిల్లలతోనే గడిచిపోయాయి మా కాలంలో. చదువులు, ఉద్యోగాలు, హోదాలు పొందటానికి మాకేం తక్కువంటూ మీ తరం ఆడపిల్లలు పోటీలు పడ్తుంటే నిజమే కదా అన్పించింది నాక్కూడా. కానీ నీ తలరాత ఇలా తగలడుతుందని నేను కల్లో కూడా అనుకోలేదు. నా మనవరాలు కలెక్టరవుతుందనుకున్నాను."

"తప్పకుండా అవుతాను. నన్ను పరీక్షలు రాయనీ నాన్నమ్మా!" దీనంగా చూసింది ఉష.

"మళ్ళీ మొదటికొచ్చావు కదా తల్లీ! నువ్వు పరీక్షలు రాయటం, ఇకమీద చదవటం అబ్బాయి కిష్టం లేదని, అలాగైతేనే పెళ్ళికి ఒప్పుకొంటామని వాళ్ళు స్పష్టంగా చెప్పారు కదా?"

"ఏ చదువు చూసుకొని నువ్వు మిడిసి పడ్తున్నావో అది నీకు లేకుండా చేస్తాను. నీ అందాన్ని... నిన్ను నా స్వంతం చేసుకుంటాను." బుద్ధిలేని శాపాన్ని వరంగా భ్రమిస్తున్న మూర్ఖత్వాన్ని ఎదుర్కొని తీరాలి. ఉష గుండెల్లో మంటలు చెలరేగుతున్నాయి.

"నా చదువు నా ఇష్టం కదా! వాళ్ళెవరు వద్దనటానికి, నాపైన బోడి పెత్తనం చేయటానికీ?" తీవ్రంగా

## రాజకీయ హాసికలు

కోటి విద్యలు
కూటి కోసం
కోటి వరాలు
ఓటు కోసం
    నోట్లు నావి
    ఓట్లు మీవి
    పాట్లు మీవి
    ప్లేట్లు నావి
మొహాలు మార్చి
ముసుగులో వచ్చారు
ఓట్ల పండుగ
    ప్రజాసేవకు
    బాజా భజంత్రీలతో
    దండ వేయండి.
ఎలక్షన్ చలి
పార్టీల కౌగిలింత
తెల్లారే దాక
    వాన రాకడ
    ఎన్నికల పోకడ
    ఎందరికెరుక!

హాసిక: నవ్వు (ఆంధ్ర దీపిక); నవ్వు; గేలి; ఎగతాళి; వేడుక (తెలుగు అకాడమి, తెలుగు నిఘంటువు)

*-గణపతిరాజు నరసింహరాజు*

ప్రశ్నించింది ఉష. కోపంతో ఆమె కళ్ళు మంకెనపూల్లా ఎర్రబడ్డాయి.

"నీ జీవితమే వాళ్ళ పెత్తనంలోకి వెళ్ళిపోయాక నీ చదువో లెక్కా తల్లీ!"

## విన్నపం

చెరువు-
కరువు కమ్మిన రైతు డొక్కలా వుంది
ముదుతలు పడ్డ ముదుసలిలా చెరువు గట్టుపై 'చెట్టునై ఏళ్ళ
తరబడి నిల్చున్నా...
మొన్న ముంగారుకు కుర్సిన చినుకుల చలువతో నా
వ్రేళ్ళ నరాలలో
యువరక్తం ప్రవహిస్తుంది
మళ్ళీ-
మరోసారి పుష్పవతినవుతాను
రాలిన ఆకులు చాపలై నన్నక్కడ కూర్చోబెడతాయ్
ఎండిన జారిన కాయలు నా కాళ్ళకి మువ్వలవుతాయ్
నగ్నమైన కొమ్మల వొంటికి లే చివుళ్ళు పైటలవుతాయ్
జగాన విరులన్నీ నా జడకు పూ మాలలవుతాయ్
రజకురాలు నా నడుముకు చుట్టిన రంగుల చీర
వడ్డాణమవుతుంది
పని పావకేసిన ఊయల యవ్వనాల ఎదలా
ఊగుతుంది
శ్రీతారణ నామధేయమైన నా "ఉగాది బావ" కోసం-
పచ్చపచ్చని చిలుకలు పిలుపుల కెళతాయ్
వేణువుల స్వాగత గీతికలతో-అరటాకుల తివాచీలపై
హుందాగా వచ్చి చందనపు సింహాసనాన్ని అధిష్ఠిస్తాడు
మయూరాలు పురివిప్పి వింజామరలు వీస్తాయ్
"మందిరపు- మసీదుల్నుండీ" వేన వేల పావురాలు
ఆకుల
ఆసనాలపై ఆశీనులవుతాయ్
ఆమని ఆకులలో వెన్నెల సున్నం రాసి మబ్బుల వక్కలు
చుట్టిన తాంబూలం బావ పెదవి చేరి సంజె ఎరుపు
సంతరించు
కుంటుండగా...
పేరంటం మొదలవుతుంది
వొరిగిన యింద్ర ధనువు గాజులు వేసి
నల్లని మేఘం కాటుక దిద్ది
చంద్రుని బింబం పౌడర్ పూసి
భానుని బింబం తిలకం రాశాక
నల్ల నల్లని కోకిలలు-
కులాలపై కుమ్ములాడుకునే నరజాతిపై భావవల్లరి
విన్పిస్తాయ్
శాంతికపోతాలు-
మతాల మారణ హోమాలపై మధనపడతాయ్
నీతిలేని నరజాతిపై-
కొమ్మలించిన కోతులు కవనం సాగిస్తాయ్
మనిషి పశుత్వంపై-
పశుత్వం లేని పశు పక్ష్యాదులు "ఉగాది బావ"కి
విన్నవించుకుంటాయ్-
ఈ తారణ అయినా బాగా పం(వుం)డాలనీ...
బాధలు తీరాలనీ.

-ఆశ్రిత్‌సాయి కాటుబోయిన

"లేదు నాన్నమ్మా! నా జీవితం నాదే! నా జీవితాన్ని నా ఇష్టాయిష్టాల ప్రకారం మలచుకొనే హక్కు నాకు మాత్రమే ఉంది. వాళ్ళ అధికారమేంటి మధ్యలో?" ఆమె గొంతులో తీవ్రత ఏమాత్రం తగ్గలేదు.

"మధ్యలో ఇలా జరక్కుండా ఉండుంటే అంతే మరి! కానీ జరక్కూడనిది జరిగి పోయింది. ఇది కుటుంబ పరువు ప్రతిష్ఠలకు, ముఖ్యంగా నీ జీవితానికి సంబంధించింది కదమ్మా! నీ భవిష్యత్తు గురించే ఇప్పుడు మనమంతా తలవంచాల్సి వచ్చింది గానీ, లేకపోతే చదువు సంధ్యల్లేని ఆ అనాకారపు ముండా కొడుక్కి నిన్ను కట్టబెట్టడానికి నేను మాత్రం ఒప్పుకొనే దాన్నా?" గుండెల్లో గుంభనంగా దాచుకున్నా... బాధ వెల్లువెత్తినపుడు నిజాలు కొట్టుకురావటం సహజమే కదా! ఎప్పుడూ కంట తడి పెట్టని నాన్నమ్మ కళ్ళల్లో నీళ్ళు చూసి చలించిపోయింది ఉష.

"నీకే అంత బాధగా ఉంటే మరి నా పరిస్థితి ఆలోచించావా నాన్నమ్మా! మీరు బలవంతంగా పెళ్ళి చేసేస్తే మాత్రం నేనా వెధవతో ఎలా కాపురం చెయ్యగలను?" ఉష నాన్నమ్మ ఒడిలో తలదాచుకొంది.

"ప్రపంచంలో చాలామంది ఆడవాళ్ళు వెధవలతో కాపురం చేసే దయనీయ పరిస్థితుల్లోనే ఉన్నారమ్మా! తప్పదు. ఇలా జరక్కుండా ఉండుంటే..." నాన్నమ్మ మాట పూర్తి కాకుండానే తోకతొక్కిన తాచులా లేచింది ఉష.

"ఇలా జరక్కుండా ఉండుంటే... సమస్యే లేదు కదా నాన్నమ్మా! కానీ సమస్యకు పరిష్కారం ఒక్కటే అని మీరు ఆలోచించటమే ఇప్పుడు పెద్ద సమస్య!"

"మరేం చెయ్యమంటావ్ ఉషా! కేసులు, కోర్టులు, గొడవలు... ఎంత అప్రతిష్ఠ? ఎవరి జీవితం నాశనమవుతుంది? నీకసలు పెళ్ళవుతుందా? నువ్వు అందర్లా నలుగుర్లో తిరగ్గలవా? ఎంత చెప్పినా అర్థం చేసుకోవేం?"

"నువ్వే అర్థం చేసుకోట్లేదు నాన్నమ్మా! ఒక్కసారి... ఒక్కసారి... నావైపు నుంచి ఆలోచించు నాన్నమ్మా! నా బాధ్యత, ప్రమేయం లేకుండా ఎవరో చేసిన తప్పుకు శిక్ష నేను ఎందుకు అనుభవించాలి? అదీ జీవితాంతమూ? చూడు. నువ్వు ఎంతో జాగ్రత్తగా ఉంటావు. ఐనా పడిపోయావు. పాదం ఎముక చిట్లింది. కొద్దిరోజులు చికిత్స, విశ్రాంతి తీసుకొంటే నువ్వు మళ్ళీ మామూలుగా లేచి తిరగ్గలవు. అలాగే నా గురించీ ఆలోచించు. జరిగింది ఒక ప్రమాదంగానే ఎందుకు అనుకోరు? గాయపడ్డాను... శారీరకంగా, మానసికంగా! ధైర్యం చెప్పి నయం చేయాల్సింది పోయి... 'రోజూ అదే ప్రమాదానికి గురవుతూ ఉండు' అని శాశ్వత శిక్ష విధించటం న్యాయమా నాన్నమ్మా? పెనం వేడి తప్పిస్తున్నామంటూ పొయ్యిలోకే తోసెయ్యటమా మీరు నాకు చేస్తున్న న్యాయం?" ఉష మాటలు చాచిపెట్టి లెంపకాయలు కొడ్తున్నట్టు దిగ్భ్రాంతిగా చూసింది నాన్నమ్మ. నోట మాట రావటం లేదు.

"మనిషి సంఘజీవి. సమాజాన్ని కాదనుకొని, వద్దనుకొని ఏ మనిషీ మనలేదు. నలుగురూ నడిచే దారిలోనే మనమూ నడవాలి. అప్పుడే మన జీవితాలకు సుఖశాంతులుంటాయి." నాన్నమ్మ మాటలు మెల్లగా జీవం లేనట్టుగా ఉన్నాయి.

"అలా అనుకొని ఉంటే... ఎంతో మంది తమ సుఖ శాంతులనే కాదు, జీవితాల్ని పణంగా పెట్టకపోయి ఉంటే... మనమీ నాటికీ ఆటవిక యుగంలోనే ఉండేవాళ్ళం కాదా నాన్నమ్మా? ఇంత మార్పు, నాగరికత, అభివృద్ధి సాధించబడేదేనా? సంస్కరణలు జరిగేవేనా? మన గమ్యం, లక్ష్యం వేరైనప్పుడు, మనమో కొత్త బాటలో నడవాలి. దారీ మనమే ఏర్పాటు చేసుకొనే క్రమంలో లోకుల విమర్శలు, కలిగే కష్టాలు అనే రాళ్ళు, రప్పలు, ముళ్ళూ మనమే నేర్పుగా, ఓర్పుగా ఏరుకోవాలి. దాని కోసమే మన జీవిత కాలమంతా ఖర్చయిపోయినా సరే ముందు తరాలకో మార్గం ఏర్పర్చిన వాళ్ళమవుతాం కదా నాన్నమ్మా? చరిత్రకో నిబద్ధతను, నాగరికతను, అభ్యుదయాన్ని కల్గించేది త్యాగాలే కాదా నాన్నమ్మా?"

ఐనా నాన్నమ్మా! కాలం మారింది. 'శీలమంటే మనిషి సచ్ఛీలతే గానీ, శారీరక పవిత్రత మాత్రమే కాదు! అని ఆలోచించే సహృదయులు ఉన్నారు. అలాంటి మనిషి నాకు తారసపడకపోడు. అప్పుడు నువ్వాశించిన వైవాహిక జీవితాన్ని నేనూ ఆనందంగా అనుభవిస్తాను. ఆ విషయంగా నువ్వు బాధపడనవసరం లేదు. ఇహ లోకులంటారా? లోకులు పలుగాకులు. అరవటం, పొడవటం తప్ప పుండు బాధ వాటికేం తెలుసు? నహేతుకం కాని ఏ కారుకూతనూ మనం పట్టించుకోనవసరం లేదు నాన్నమ్మా! న్యాయం, ధర్మం, మంచిదని మనం నమ్మిన పనిని త్రికరణ శుద్ధిగా ఆచరించటమే!"

తన కళ్ళ ముందు పుట్టి, తన చేతుల్లో పెరిగిన చిన్నారి మనవరాలు... జీవితాన్ని కాచి వడబోసినట్లు... పెద్ద ఆరిందాలా... ఆర్తిగా... హృదయానికి హత్తుకునేలా తనలోని తమస్సును తుడిచేసే తొలి ఉషా కిరణాల్లా... ఉష మాటల్ని అబ్బురంగా వింటోంది నాన్నమ్మ. వింటూ ఆలోచిస్తూంది... మారిన ఆలోచనా దృక్పథంతో!

ఉషా! ఈ పోళీలు వత్తటం నాచేత కావటం లేదు. పూర్ణమంతా బయటకు వచ్చేస్తోంది. కాస్త రావే! ఈ పని చూద్దాం. పనులే తెమలటం లేదసలు!" తల్లి వంటింట్లో నుండి అరుస్తోంది.

పోళీలు ఉగాది స్పెషల్ వంటకం. పూర్ణం ఒక్క రవ్వ బయటకు రాకుండా ఎంతో పల్చగా, పెద్ద పెద్ద పోళీలు ఒంటిచేత్తో చేసేది నాన్నమ్మ. అమ్మకస్సలు చాతరాదు.

"వెళ్ళు ఉషా! ఆ పూర్ణం, పిండి ఇలా తీసుకురమ్మను. నేను ఒత్తి ఇస్తాలే! నువ్వెళ్ళి చదువుకో! పదిహేను రోజులుగా పుస్తకమే తాకలేదు. పరీక్షలు దగ్గరకొచ్చేశాయి కదా! బంగారు పతకం నీకే వస్తాదని చెప్పారన్నావు కదా మీ సారులు. తెచ్చుకో మరి!"

ప్రేమ పేరుతో వెంటపడి, వేధించినా తను ఒప్పుకోలేదని రేప్ చేసి, పెళ్ళి తప్ప మరో గత్యంతరం లేదని విర్రవీగుతున్న అపర కీచకుడి కళ్ళు బైర్లు కమ్మించే యుగాది క్రాంతులు నాన్నమ్మ దృఢమైన మాటల్లో వెలుగులు చిమ్ముతుంటే... వసంతాగమన స్వాంతనలో పరవశించిన మనసు కోయిల హాయిగా, స్వేచ్ఛగా గొంతు విప్పింది.

"నాన్నమ్మా!"

ఉష కళ్ళల్లో ఆనందాశ్రువులు తుడుస్తూ చెప్పింది నాన్నమ్మ ఆశీర్వదిస్తున్నట్లుగా.

"ఒక మనిషిగా నువ్వు పది మందికి ఆదర్శమైతే అంతకన్నా ఆనందం మరేముంటుంది?" ●